ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

అనకాపల్లి

జిల్లా వార్తలు

శుక్రవారం 16 ఫిబ్రవరి 2024



19న సీఎం రాక?

- శారదా పీఠం వార్షికోత్సవానికి హాజరయ్యే అవకాశం

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈనెల 19వ తేదీన నగరానికి రానున్నారు. చినముషిడివాడలో గల శారదా పీఠం వార్షికోత్సవంలో ఆయన పాల్గొననున్నారు. ఈ మేరకు అమరావతి నుంచి సమాచారం అందడంతో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. అయితే సీఎం పర్యటన షెడ్యూల్ వివరాలు ఇంకా అందాల్సి ఉంది.

అధికారులపై సీఎం అసంతృప్తి

'ఆడుదాం...ఆంధ్రా' ముగింపు వేడుకల వైఫల్యంపై ఆగ్రహం

- రెండు రోజుల క్రితం పీఎం పాలెం స్టేడియంలో కార్యక్రమం నిర్వహణ
- స్టేడియం కెపాసిటీ 25,000
- జనం తరలింపునకు వందలాది బస్సులు ఏర్పాటుచేసినా గట్టిగా 5,000 మంది కూడా హాజరుకాని వైనం
- కార్యక్రమం సమయంలోనూ, ఆ తరువాత ఎయిర్‌పోర్టులో జిల్లా అధికారులపై ఆగ్రహం



ఆడుదాం ఆంధ్రా ముగింపు కార్యక్రమంలో ఖాళీగా వున్న ఏడీఏ-వీడీసీఏ స్టేడియం



విచార వదనంతో సీఎం జగన్ (ఫైల్)

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):

'ఆడుదాం...ఆంధ్రా' ముగింపు వేడుకల నిర్వహణలో విఫమయ్యారంటూ జిల్లా అధికారులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేసినట్టు చెబుతున్నారు. పీఎం పాలెంలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈనెల 13న రాష్ట్రస్థాయి పోటీల ముగింపు వేడుక జరిగిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం హాజరయ్యారు. అయితే స్టేడియం సామర్థ్యం 25 వేలు కాగా కనీసం ఐదు వేల మంది కూడా రాలేదు. ఆ వచ్చిన వారిలో కూడా అత్యధికులు డ్వాక్రా మహిళలు, వలంటీర్లే. దాంతో జన సమీకరణపై అప్పుడే సీఎం తీవ్ర అసహనం వ్యక్తంచేయడం కనిపించింది.

రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో గ్రామ, వార్డు సచివాలయం స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించింది. దీనికోసం ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారం చేసింది. సుమారు రూ.100 కోట్లు వెచ్చించింది. ఈ పోటీలను నిర్వహించడం ద్వారా యువతను ఆకట్టుకోవచ్చునని, ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చునని వైసీపీ పెద్దలు భావించారు. కానీ పోటీల నిర్వహణకు సరైన సదుపాయాలు కల్పించకపోవడం, నిబంధనలను పాటించకపోవడం, అనుకూలమైన జట్లకు మేలు కలిగించేలా వ్యవహరించడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఇలాంటి తరుణంలో 'ఆడుదాం...ఆంధ్రా' ముగింపు వేడుకలను ఈనెల 13న నగరంలోని పీఎం పాలెం స్టేడియంలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. స్టేడియం సామర్థ్యం 27,500 కాగా, వేదిక వెనుక భాగంతో పాటు సమీపంలోని గ్యాలరీలను మినహాయిస్తే 25 వేల మందిని తీసుకురావాల్సి ఉంటుందని వైసీపీ నేతలు, అధికారులు అంచనా వేశారు. ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌లో నగరం నుంచి పాల్గొన్న 45 వేల మంది క్రీడాకారుల్లో నాలుగో వంతు వచ్చినా, ఇంకా విద్యార్థులు, మహిళా సంఘాలు, పార్టీ కార్యకర్తలను కలుపుకుంటే సులభంగా 25 వేల మార్కును దాటిపోతారని అధికారులు ధీమా వ్యక్తంచేశారు. జనం తరలింపు కోసం నగరవ్యాప్తంగా 585 ఆర్టీసీ బస్సులను కూడా ఏర్పాటుచేశారు. తీరా వేడుక ప్రారంభమయ్యేసరికి స్టేడియంలో కనీసం నాలుగైదు వేల మంది కూడా లేకపోవడంతో అధికారులతో పాటు పార్టీ నేతలు కంగుతిన్నారు. అప్పటికప్పుడు సమీపంలోని ఇంజనీరింగ్, ఇంటర్ కాలేజీలకు ఫోన్లు చేసి విద్యార్థులను పంపించాలని అధికారులు ఆదేశించారు. అయినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. సీఎం జగన్ స్టేడియంలోకి ప్రవేశించేసరికి జనాలు లేకపోవడంతో అవాక్కయ్యారు. స్టేడియంలోని గ్యాలరీలన్నీ ఖాళీగా ఉండిపోవడంతో అక్కడే పార్టీ నేతలపై తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. ముందుగా అనుకున్నట్టు స్టేడియం చుట్టూ ఓపెన్ టాప్ జీపులో తిరుగుతూ ప్రజలకు అభివాదం చేసే కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఇక స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు మీడియా గ్యాలరీ దిగువన ప్రత్యేకంగా సీఎం కోసం ఏర్పాట్లు చేశారు. కానీ సీఎం అక్కడకు వెళ్లకుండా నేరుగా సభా వేదికపైకి వెళ్లిపోయారు. జన సమీకరణలో విఫలమవడంపై అధికారులను పిలిచి అప్పుడే తన అసంతృప్తిని వ్యక్తంచేసినట్టు సమాచారం. వేదిక వద్ద అధికారులు కనీసం స్నాక్స్ కూడా ఏర్పాటుచేయకపోవడంతో ... మిగతా 8వ పేజీలో

ప్రకృతి విధ్వంసం

మొగలిపురంలో గోపాల బంద పూడ్చివేత

యంత్రాలతో తాటి చెట్లు కూల్చి.. గట్లు తవ్వకం

- పది రోజుల నుంచి చదును పనులు
- తమ శాఖ పరిధిలో ఉందంటున్న ఇరిగేషన్ అధికారులు
- గతంలో ఉపాధి పథకం కింద పూడిక తీత పనులు
- రెవెన్యూ రికార్డుల్లో మాత్రం జిరాయితీగా నమోదు



మొగలిపురంలో నీరు వున్న గోపాల బందను పూడ్చివేస్తున్న దృశ్యం



తాటి చెట్లు కూల్చివేత

సబ్బవరం, ఫిబ్రవరి 15:

మండలంలోని మొగలిపురం గ్రామంలో ప్రకృతి విధ్వంసం జరుగుతున్నది. సుమారు ఏడు ఎకరాల విస్తీర్ణంలో వున్న గోపాల బందను(చెరువు) గట్ల మీద వున్న చెట్లను యంత్రాలతో కూల్చివేస్తున్నారు. గట్లను ధ్వంసం చేసి, చెరువును కప్పేస్తున్నారు. రెవెన్యూ రికార్డుల్లో జిరాయితీగా వున్న సాగునీటి బందను నామరూపాలు లేకుండా ధ్వంసం చేస్తుండడంతో సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. ఇరిగేషన్ అధికారులు జోక్యం చేసుకోవడంతో తాత్కాలింగా పనులు ఆపారు. వివరాల్లోకి వెళితే...

మొగలిపురం గ్రామంలో 43 సర్వే నంబరులో 6.9 ఎకరాల్లో గోపాల బంద (చెరువు) ఉంది. అనాదిగా ఈ బందకు ఎగువ ప్రాంతం నుంచి వర్షం నీరు వచ్చేందుకు సర్వే నంబరు 29లో 1.87 ఎకరాలు, సర్వే నంబరు 45లో 1.13 ఎకరాల్లో వాగులు ఉన్నాయి. బంద కింద 16 ఎకరాల ఆయకట్టు ఉంది. కాగా రెవెన్యూ రికార్డుల్లో ఇది జిరాయితీ అని వుండగా, ఇరిగేషన్ శాఖ వద్ద ఉన్న రికార్డుల్లో గోపాల బంద అని ఉంది. గతంలో ఈ చెరువులో ఉపాధి హామీ పథకం కింద పూడికతీత పనులు కూడా చేపట్టారు. ఇదిలావుండగా సుమారు పది రోజుల నుంచి కొంత మంది వ్యక్తులు యంత్రాలతో బందను చదును చేయిస్తున్నారు. సుమారు పది అడుగుల ఎత్తు వున్న గట్లను తవ్వేసి చెరువును పూడుస్తున్నారు. వందలాది తాటి చెట్లను కూలివేసి దహనం చేస్తున్నారు. దీనిపై కొంతమంది స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా, గోపాల బంద జిరాయితీగా వుందని చెబుతూ ఇటువైపు కన్నెత్తి అయినా చూడడంలేదు. ఒకవేళ జిరాయితీ అయినప్పటికీ 2013లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం సహజసిద్ధమైన నీటి వనరులను ధ్వంసం చేయకూడదు. అంతేకాక 'వాల్టా' చట్టానికి తూట్లు పొడుతూ వందల సంఖ్యలో తాటి చెట్లను కూల్చివేశారు. నిబంధనల ప్రకారం సాగునీటి బందలు/చెరువుల్లో ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు, పూడిక తీత పనులు చేపడితే.. అవి సాగునీటి శాఖ పరిధిలోకే వస్తాయి. కానీ ఇవేవి పట్టించుకోకుండా భారీ యంత్రాలతో చదును చేసేసి, నీటితో ఉన్న చెరువును కప్పేస్తున్నారు. కొంతమంది బడా రియల్టర్లు.. రాజకీయ పలుకుబడితో అధికారులపై ఒత్తిడి తెచ్చి, గోపాల బందను ధ్వంసం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



తాటి చెట్లు తొలగించి చదును చేసిన ప్రదేశం

గోపాల బంద ఇరిగేషన్ శాఖ పరిధిలోనే ఉంది

మొగలిపురం గ్రామంలోని గోపాలబంద సాగునీటి శాఖ పరిధిలోనే ఉంది. 2005లో పంచాయితీరాజ్ శాఖ నుంచి ఇరిగేషన్ శాఖకు బదిలీ అయ్యింది. 2017లో ఉపాధి హామీ పథకం కింద పూడికతీత పనులు చేపట్టాం. గోపాల బందను పూడ్చివేస్తున్న విషయం తెలుసుకుని మూడు రోజుల క్రితం అక్కడకు వెళ్లి పనులు నిలుపుదల చేయించాం. దీనిపై ఉన్నతాధికారులతోపాటు తహసీల్దార్‌కు కూడా లిఖిత పూర్వకంగా సమాచారం ఇచ్చాం.

రామలక్ష్మణ, జేఈ, జలవనరుల శాఖ, సబ్బవరం

నా తలరాత జగనే రాస్తారు

ఎన్నికల్లో పోటీ చేస్తేనే రాజకీయాల్లో ఉన్నట్టా? లేకపోతే లేనట్టేనా?

- 15 మంది అభ్యర్థులను గెలిపించే బాధ్యత నాదే
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్



విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వచ్చే ఎన్నికల్లో తన పాత్ర, బాధ్యతలు ఏమిటో చాలా స్పష్టంగా వెల్లడించారు. సిరిపురంలోని చిల్డ్రన్ ఎరీనాలో గురువారం సాయంత్రం వలంటీర్ల సన్మాన కార్యక్రమం పూర్తయిన తరువాత విలేకరులతో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేస్తారని విలేకరులు ప్రశ్నించగా, సీఎం జగన్ రాసిన విధంగానే తన తలరాత ఉంటుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తేనే రాజకీయాల్లో ఉన్నట్టా?, లేకపోతే లేనట్టేనా?...అని ఎదురు ప్రశ్నించారు. పార్టీ కోసం పనిచేయాల్సిన అవసరం వచ్చిందని గుర్తించి తనకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారన్నారు. తనకు ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్ పదవి ఇచ్చారన్నారు. జిల్లాలో వైసీపీ నుంచి పోటీ చేసే 15 మంది అభ్యర్థులను గెలిపించే బాధ్యత తనదేనన్నారు. పూర్తిస్థాయిలో పనిచేసి బాధ్యతలు నెరవేరుస్తానన్నారు.

చెరకు రైతులు ఆగ్రహం

వడ్డాది కాటా నుంచి గోవాడ ఫ్యాక్టరీకి నిలిచిన సరఫరా

- కూలి డబ్బులు చెల్లించకపోవడంతో కార్మికులు సమ్మె
- పట్టించుకోని ఫ్యాక్టరీ యాజమాన్యం
- చెరకు ఎండిపోతున్నదని రైతులు ఆందోళన
- కాటా భవనానికి తాళాలు వేసి నిరసన



చెరకు కాటా వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 15:

వడ్డాది కాటా నుంచి గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి చెరకు తరలింపులో తీవ్రజాప్యాన్ని నిరసిస్తూ రైతులు గురువారం ఆందోళనకు దిగారు. వడ్డాది చెరకు కాటా భవనానికి రైతులు తాళాలు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, ప్రస్తుత సీజన్‌లో క్రషింగ్ ప్రారంభం నాటి నుంచి చెరకు తరలింపు అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. రోజుల తరబడి కాటాల వద్ద చెరకు నిలిచిపోవడానికి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం అసమర్థతే కారణమని ధ్వజమెత్తారు. వడ్డాది కాటా వద్ద పనిచేస్తున్న కార్మికులకు 45 రోజుల నుంచి కూలి డబ్బులు చెల్లించకపోవడంతో మూడు రోజుల నుంచి చెరకు లోడింగ్ పనులు ఆపేశారని చెప్పారు. అప్పటికే రెండు రోజుల నుంచి రైతులు చెరకు బండ్లతో వేచివున్నారని, కార్మికుల సమ్మె కారణంగా మొత్తం ఐదు రోజులుగా కాటా వద్ద పడిగాపులు పడుతున్నామని వాపోయారు. చెరకు ఎండిపోయి బరువు తగ్గిపోతున్నదని, సమస్య ఇంత తీవ్రంగా వున్నప్పటికీ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కాటాల వద్ద లోడింగ్ పనులు, ఫ్యాక్టరీకి చెరకు రవాణాకు ఒకే కాంట్రాక్టర్ వుండేవారని, ఈసారి ... మిగతా 8వ పేజీలో

మరుపాక మోడల్ స్కూల్ బాలికల ఇక్కట్లు



వసతి లేదు.. సమస్య తీరదు!

- పదేళ్ల క్రితం 'ఆదర్శ పాఠశాల' ఏర్పాటు
- 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు బాలికలకు హాస్టల్ ఉండాలని నిబంధన
- స్థల వివాదంతో నిర్మాణానికి నోచుకోని భవనం
- వెనక్కు మళ్లిన నిధులు
- ఆరేళ్ల క్రితం ప్రత్యామ్నాయ స్థలం కేటాయింపు
- నిధులు మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఐదేళ్లు దాటినా లభించని ఆమోదం
- పాఠశాలకు రాకపోకలకు ఇబ్బంది పడుతున్న సుదూర గ్రామాల బాలికలు
- ఆటో చార్జీల కోసం నెలకు వెయ్యి రూపాయలు ఖర్చు



వసతిగృహం నిర్మాణానికి కేటాయించిన స్థలం ఇదే!



ఆటోలో పాఠశాలకు వెళ్తున్న బాలికలు

రావికమతం, ఫిబ్రవరి 15:

మండలంలోని మరుపాకలో ఆదర్శ పాఠశాలను ఏర్పాటు చేసి పదేళ్లు దాటినప్పటికీ ఇంతవరకు బాలికలకు వసతిగృహం నిర్మించకపోవడంతో సుదూర గ్రామాలకు చెందిన విద్యార్థినులు రోజూ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిధులు అందుబాటులో వున్నప్పుడు స్థల వివాదం కారణంగా హాస్టల్ భవనం నిర్మాణం జరగలేదు. స్థలం సమస్య కొలిక్కి వచ్చేసరికి నిధులు వెనక్కు మళ్లాయి. దీంతో నిధుల కోసం మళ్లీ ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ఇది జరిగి ఐదేళ్లు అవుతున్నప్పటికీ నిధులు మంజూరు కాలేదు.

జిల్లాలో నర్సీపట్నం మండలం వేములపూడి, రావికమతం మండలం మరుపాక, చీడికాడ మండలం మంచాల, కోటవురట్ల మండల తేగాడ, మునగపాక మండలం పాటిపల్లిలో మోడల్ స్కూళ్లు వున్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లిష్ మీడియంలో పూర్తి ఉచితంగా విద్యా బోధన వుంటుంది. పాఠశాల నుంచి ఐదు కిలోమీటర్లకు మించి దూరంలో వున్న గ్రామాలకు చెందిన 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే బాలికలకు పాఠశాలలోనే హాస్టల్ సదుపాయం వుంటుంది. అయితే జిల్లాలోని మరుపాక మినహా మిగిలిన అన్ని పాఠశాలల్లో బాలికలకు వసతిగృహాలు వున్నాయి. మరుపాకలో హాస్టల్ నిర్మాణానికి కేటాయించిన స్థలం తనదంటూ ఓ వ్యక్తి అడ్డం తిరగడంతో భవన నిర్మాణం ప్రారంభ కాలేదు. దీంతో నిధులు వెనక్కు మళ్లాయి. కాగా స్థల సమస్యను 2018లో పాఠశాల యాజమాన్యం అప్పటి ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు దృష్టికి తీసుకెళ్లింది. ఆయన మోడల్ స్కూల్‌కు ఆనుకుని ఎకరా స్థలాన్ని మంజూరు చేయించారు. అనంతరం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అప్పటి ప్రిన్సిపాల్ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇది జరిగి సుమారు ఐదేళ్లు దాటింది. కానీ ఇంతవరకు నిధులు మంజూరు కాలేదు. దీంతో స్కూల్‌కు సుదూరంలో వున్న గ్రామాలకు చెందిన విద్యార్థినులు రోజూ వ్యయప్రయాసలతో రాకపోకలు సాగించాల్సి వస్తున్నది. ఆయా గ్రామాల నుంచి మోడల్ స్కూల్‌కు బస్సు సదుపాయం లేకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సి ... మిగతా 8వ పేజీలో

నెలకు రూ.1,000 ఆటో చార్జీలు



నేను 2018-19లో మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో చేరాను. 9వ తరగతి నుంచి హాస్టల్‌లో వుండొచ్చని చెప్పారు. కానీ అప్పుడు హాస్టల్ నిర్మించలేదు. త్వరలో నిర్మాణం జరుగుతుందని అధికారులు చెప్పారు. ఇప్పుడు పదో తరగతిలో వున్నాను. కానీ హాస్టల్ భవనం నిర్మించలేదు. చుట్టుపక్కల గ్రామానికి చెందిన పది మంది బాలికలు కలిసి ఒక ఆటో మాట్లాడుకున్నాం. ఉదయం స్కూల్‌కు తీసుకెళ్లడానికి, సాయంత్రం తిరిగి ఇంటికి రావడానికి ఒక్కొక్కరు నెలకు రూ.1,000 చొప్పున ఇస్తున్నాం.

- వాకాడ నాగమణి (పదో తరగతి),
బలిజపాలెం, రోలుగుంట మండలం

నియంత పాలన త్వరలోనే అంతం

ఎన్నికల తరువాత ఏర్పడేది జనసేన-టీడీపీ ప్రభుత్వమే

- జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు
- అనకాపల్లి నుంచి పోటీపై పార్టీ అధినేత మాట్లాడతారని వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు. చిత్రంలో పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్, పీవీఎస్ఎన్ రాజు

రాంబిల్లి, ఫిబ్రవరి 15: రాష్ట్రంలో నియంత పాలన సాగిస్తున్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, త్వరలో జరగనున్న ఎన్నికల అనంతరం జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు అన్నారు. గురువారం ఆయన మండలంలోని హరిపురంలో జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నియోజకవర్గాల ఇన్‌చార్జిలుతో సమావేశమయ్యారు. తొలుత నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిల సమస్యలు, పార్టీ చేస్తున్న కార్యక్రమాల గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తూ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేశారని ఆరోపించారు. అభివృద్ధి పనులు చేయపోగా, ప్రజలపై ఎడాపెడా పన్నులు భారం మోపుతున్నారని ధ్వజమెత్తారు. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సొంత సొమ్ముతో హెలికాప్టర్‌లో జిల్లాల పర్యటనకు వెళుతుంటే, వైసీపీ ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం లేదని అన్నారు. సీఎం మాత్రం 30 కిలోమీటర్ల దూరంలో పాల్గొనే కార్యక్రమాలకు కూడా హెలికాప్టర్‌లో వెళుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని ఆయన ప్రశ్నించారు. అనకాపల్లి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తారని జరుగుతున్న ప్రచారంపై మీడియా ప్రతినిధులు ఆయనను ప్రశ్నించగా, ఇంతవరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని, అయినప్పటికీ దీనిపై తమ పార్టీ అధ్యక్షుడు మాట్లాడతారని చెప్పారు. పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తానన్నారు. జనసేన, టీడీపీ కూటమిలో బీజేపీ కూడా ఉండాలని కోరుకుంటున్నానని నాగబాబు చెప్పారు. ఈ సమావేశంలో ఉమ్మడి విశాఖ జిల్లా రూరల్ అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు సుందరపు విజయకుమార్, పరుచూరి భాస్కరరావు, పీవీఎస్ఎన్ రాజు, రాయపురెడ్డి కృష్ణ, సూర్యచంద్ర, గెడ్డం బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

టమాటా ధరలు పతనం

- 30 కిలోల క్రేట్ రూ.200కు కొనుగోలు చేసిన వ్యాపారులు
- నెల రోజుల క్రితంతో పోలిస్తే మూడో వంతుకు ధర పడిపోయిందని రైతులు ఆవేదన

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 15:

'అమ్మబోతే అడవి.. కొనబోతే కొరవి' అన్న సామెతలా తయారైంది టమాటా రైతుల పరిస్థితి. తాము పండించిన పంట చేతికి వచ్చిన సమయంలో ధరలు నేల చూపులు చూస్తుంటాయని, పంట అయిపోయిన తరువాత ధరలు ఆకాశాన్ని అంటుతాయని వాపోతున్నారు. ఇటీవల వరకు టమాటా ధరలు రిటైల్‌గా కిలో రూ.30 నుంచి రూ.40 వరకు వున్నాయి. స్థానిక రైతులు సాగు చేసిన పొలాల్లో టమాటా పంట కొద్ది రోజుల నుంచి చేతికి వస్తుండడంతో ధరలు క్రమేపీ తగ్గుతున్నాయి. గురువారం కొయ్యూరు, గొలుగొండ మండలాల్లోని పలు గ్రామాల నుంచి రైతులు కృష్ణాదేవిపేట మార్కెట్‌కు టమాటాలు తీసుకు వచ్చారు. సుమారు 30 కిలోలు వున్న క్రేట్ టమాటాలు రూ.200 నుంచి రూ.210లకు వ్యాపారులు కొనుగోలు చేశారు. సరిగ్గా నెల రోజుల క్రితం క్రేట్ టమాటాలు రూ.600లకుపైబడి ధర పలికిందని, ఇప్పుడు మూడో వంతుకు పడిపోయిందని రైతులు వాపోతున్నారు.



కృష్ణాదేవిపేటలో విక్రయానికి తెచ్చిన టమాటాలతో రైతులు

క్రైం... crime news

పశువులు తరలిస్తున్న కంటైనర్ లారీ పట్టివేత

» 65 పశువులు స్వాధీనం... ఇద్దరి అరెస్టు



కోనవానిపాలెం వద్ద లారీ కంటైనర్‌లో పట్టుబడ్డ పశువులు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 15: మండలంలోని కోనవానిపాలెం వద్ద జాతీయ రహదారిపై గురువారం కబేలాకు 65 ఆవులు, ఎద్దులను తరలిస్తున్న కంటైనర్ లారీలో పట్టుకున్నట్టు ఎస్‌ఐ అట్టాడ విభీషనరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన నౌరంగబాద్ నుంచి విజయవాడ హనుమాన్ జంక్షన్‌కు పశువులతో వెళుతున్న కంటైనర్ లారీని పెనుగొల్లుకు చెందిన గో రక్షణ చారిటబుల్ ట్రస్టు సభ్యులు గొర్ల దేముళ్ళు, ఆర్.లోవ రాజు, ఎస్. దేముళ్లు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు జాతీయ రహదారిపై మాటువేసి కంటైనర్ లారీని పెనుగొల్లు దగ్గర నుంచి అడ్డరోడ్డు వరకు వెంబడించి కోనవానపాలెం వద్ద పట్టుకొన్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి లారీని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్, పశువులను తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలు

గొలుగొండ, ఫిబ్రవరి 15: మండలంలోని చీడిగుమ్మల సమీపంలో బైక్ ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ కృష్ణారావు తెలిపిన వివరాలివి. చీడిగుమ్మలకు చెందిన వానపల్లి వెంకట లోవ రాజు గురువారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో నర్సీపట్నం బైక్‌పై వెళుతున్నాడు. గ్రామానికి సమీపంలో గల వంతెన వద్దకు వచ్చేసరికి బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో అతని తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్‌ఐ చెప్పారు.

62 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో సీఐ అప్పలనాయుడు, ఎస్సై సురేష్

రోలుగుంట, ఫిబ్రవరి 15: మండలంలోని కొరుప్రోలు శివారున పోలీసులు గురువారం ఉదయం 62 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సీఐ అప్పలనాయుడు తెలిపిన వివరాలు ప్రకారం..ఎస్‌ఐ సురేష్‌కు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు సిబ్బంది కొరుప్రోలు శివారులో వాహనాల తనిఖీ చేపట్టగా ఒక వాహనంలో గంజాయి లోడ్ చేయడానికి సిద్ధంగా ఉంచినట్టు గమనించి, స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు జి. మాడుగుల మండలం గెమిలి పంచాయతీ వరిగిలపాలెం గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలుడ్ని అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. 3.10 లక్షలు ఉంటుంది.బాలుడ్ని జువైనెల్ హోంకు తరలించినట్టు సీఐ తెలిపారు.

వలంటీర్లూ వెనుతిరిగారు!

పురస్కారాల ప్రదాన కార్యక్రమం వుడా చిల్డ్రన్ ఎరీనాలో ఏర్పాటు

గుంటూరు నుంచి సీఎం ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం

వినకుండా వెళ్లిపోబోయిన వలంటీర్లు

అడ్డుకుని తిరిగి లోపలకు పంపిన సచివాలయ కార్యదర్శులు



వెళ్లిపోతున్న వలంటీర్లను అడ్డుకుంటున్న దృశ్యం

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగంపై వార్డు వలంటీర్లు కూడా విసిగిపోయారు. వలంటీర్లకు సేవామిత్ర, సేవా రత్న, వజ్ర పురస్కారాల ప్రదానోత్సవం రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని గురువారం గుంటూరులో నిర్వహించారు. జీవీఎంసీ పరిధిలోని వార్డు వలంటీర్లకు సేవామిత్ర, రత్న, వజ్ర పురస్కారాలను అందజేసే కార్యక్రమాన్ని సిరిపురం కూడలిలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఏర్పాటు చేశారు. వేదికపై మంత్రి అమర్‌నాథ్, జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ కూర్చున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైన కార్యక్రమం సాయంత్రం ఆరు గంటల వరకూ సాగింది. గుంటూరులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని ఎల్‌ఈడీ స్ర్కీన్లపై ప్రత్యక్ష ప్రసారం చేయడంతో...అందరూ శ్రద్ధగా వినాలని అధికారులు ఆదేశించారు. అయితే సీఎం ప్రసంగం ప్రారంభమైన కొద్దిసేపటికే కొంతమంది వలంటీర్లు లేచి బయటకు వెళ్లిపోవడం ప్రారంభించారు. దీనిని వేదికపై ఉన్న మంత్రి, కలెక్టర్ గమనించారు. వలంటీర్లను బయటకు వెళ్లకుండా ఆపాలని అక్కడున్న వార్డు సచివాలయ సిబ్బందికి సూచించారు. దీంతో వార్డు సచివాలయ కార్యదర్శులు పరిగెత్తుకుంటూ వెళ్లి...మెట్లు దిగి బయటకు వెళ్లిపోతున్న వారిని అడ్డుకుని తిరిగి లోపలకు పంపించారు. తర్వాత ఎవరూ వెళ్లకుండా బయట నుంచి తలుపులకు గడియపెట్టేశారు. టాయ్‌లెట్స్‌కు వెళతామన్నా సరే బయటకు పంపించకపోవడంతో చాలామంది మహిళా వలంటీర్లు ఇబ్బందిపడ్డారు.

హస్తకళలు దేశానికి వెన్నెముకలాంటిది

» లేపాక్షి చైర్‌పర్సన్ విజయలక్ష్మి



గొల్లపేటలో శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బృందం

కోటవురట్ల, ఫిబ్రవరి 15: హస్తకళలు దేశానికి వెన్నెముక వంటిదని ఏపీ హస్తకళ అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్‌పర్సన్ బి.విజయలక్ష్మి అన్నారు. మండలంలో కైలాసపట్నం, గొల్లపేటల్లో లక్కబొమ్మలు తయారీపై ఇస్తున్న శిక్షణ తరగతులను హస్తకళ అభివృద్ధి కార్పొరేషన్ బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి దేశవ్యాప్తంగా ఉన్న లేపాక్షి ఎంపోరియంల ద్వారా ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి వారు తయారుచేసిన బొమ్మలను విక్రయించుకునేందుకు అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి జిల్లా మేనేజరు కార్తీక, సిబ్బంది దయ, మాస్టర్ క్రాఫ్ట్ మెన్‌తురాల శ్రీను పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

రథసప్తమికి రాజుపాలెం ముస్తాబు

» నేడు ఆదిత్యుని ఆలయంలో ప్రత్యేక పూజలు
» భారీగా తరలిరానున్న భక్తులు
» ఇనుప క్యూలైన్లు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు
» భారీగా పోలీస్ బందోబస్తు



సూర్యనారాయణమూర్తి మూలవిరాట్



రాజుపాలెంలోని రథసప్తమి వేడుకలకు ముస్తాబైన సూర్యనారాయణమూర్తి ఆలయం

అనకాపల్లిరూరల్, ఫిబ్రవరి 15: మండలంలో రాజుపాలెం సూర్యనారాయణమూర్తి ఆలయం రథసప్తమి వేడుకలకు ముస్తాబయ్యింది. కొండదిగువన ఈత చెట్టు మధ్య వెలిసిన స్వామివారిని 2010 సంవత్సరంలో చినజీయర్ స్వామి ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ప్రతిఏటా అరసవల్లిలో జరిగే వేడుకల తరహాలో ఇక్కడ ఆలయంలో రథ సప్తమిని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా ఈనెల 16వ తేదీన జరిగే రథసప్తమి వేడుకలకు ఆలయకమిటీ ఏర్పాట్లు చేసింది. ఆలయానికి రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు అడుగడుగునా అన్నసమారాధనకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. సూర్య నారాయణ స్వామివారిని సాయంత్రం పుర వీధుల్లో ఊరేగించేందుకు టేకు రథాన్ని సిద్ధం చేశారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రథసప్తమి వేడుకలకు వచ్చే మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులకు భద్రతా ఏర్పాట్లను చేస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా అనకాపల్లి రూరల్, టౌన్, పరవాడ, మునగపాక, కశింకోట, సబ్బవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, ఎలమంచిలి పోలీస్ స్టేషన్ల నుంచి ముగ్గురు సీఐలు, 10 మంది ఎస్‌ఐలు, 20మంది ఏఎస్‌ఐలు, 145 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు ఆలయ కమిటీ ప్రతినిధులతో చర్చించి నాలుగు చోట్ల పార్కింగ్ స్థలాలను ఎంపిక చేశారు.



స్వామి దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లు

నిర్వాసిత యువతకు ఉపాధి కల్పన

» సింహాద్రి ఎన్‌టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సింహాద్రి సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ, ఫిబ్రవరి 15 : నిర్వాసిత గ్రామాల యువతకు ఉపాధి కల్పించేందుకు పెద్దపీట వేశామని సింహాద్రి ఎన్‌టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా వెల్లడించారు. గురువారం స్థానిక ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతకు ఉపాధిలో శిక్షణ కల్పించేందుకు విజయవాడకు చెందిన సీపీఈటీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. యువతకి శిక్షణ ఇవ్వడంతోపాటు వారికి ఉద్యోగావకాశాలు కూడా కల్పించడం జరుగుతుందన్నారు. నిర్వాసిత గ్రామాల్లో పూర్తిస్థాయి మౌలిక వసతులను కల్పించేందుకు కోట్లాది రూపాయల సీఎస్ఆర్ నిధులను వెచ్చిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలను పూర్తిస్థాయిలో పాటిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తున్నామని చెప్పారు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డుతో ఆన్‌లైన్ విధానంలో తమ ప్రాజెక్టు అనుసంధానమైనట్టు వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దీపికా లేడిస్ క్లబ్ ద్వారా మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్ వంటి విభాగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఫ్లయాష్ లారీల రాకపోకల కారణంగా రహదారులు దెబ్బతింటున్నాయని, వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని విలేకరులు ప్రశ్నించగా ఇందుకోసం ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు సీజీఎం వెల్లడించారు. నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తే సింహాద్రి ప్రాజెక్టు లక్ష్యమన్నారు. కార్మికుల భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని సీజీఎం స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల జీఎంలు డీపీ పాత్ర, టీఆర్ రాజగోపాలన్, పద్మప్రియ, జగన్మోహనరావు, హెచ్‌ఆర్ విభాగం ఏజీఎం బీబీ పాత్ర తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం



విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఈవో



నక్కపల్లి కేజీబీవీ విద్యార్థినికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 15: స్థానిక ఉడ్‌పేట జీవీఎంసీ పాఠశాలలో గురువారం జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ అవార్డు వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనను డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను పరిశీలించారు.

ఇందులో అనకాపల్లి జిల్లా నుంచి 123 ప్రాజెక్టులు.. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఐదు ప్రాజెక్టులు ప్రదర్శించారు. జాతీయస్థాయి పరిశీలకులు డాక్టర్ మోహిత్ రహిద్‌షేక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా సైన్స్ అధికారి కాళిదాసు, అల్లూరి జిల్లా సైన్స్ అధికారి నాగేశ్వరరావు, విద్యాశాఖ ఏడీ ఏ.రవిబాబు పాల్గొనగా చిత్తూరు జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి ప్రదర్శనలో ఇక్కడ ఎంపికైన ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తారని ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ప్రాజెక్టుల ఎంపిక

ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఈ కింది పాఠశాలలకు చెందిన విద్యార్థుల ప్రాజెక్టులు ఎంపికయ్యాయని డీఈవో కార్యాలయ వర్గాలు తెలిపాయి. వీటిలో అనకాపల్లి జిల్లా జంపపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, సీతానగరం, దోసూరు, దొండపూడి, లక్ష్మీపురం, చెట్టుపల్లి, ఏ.కోడూరు, వీరనారాయణం, కశింకోట బాలికోన్నత పాఠశాల, ఎస్.రాయవరం, కశింకోట సెయింట్‌జాన్స్ హైస్కూల్, నక్కపల్లి కేజీబీవీ స్కూల్ విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయని తెలిపారు.

అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రాజెక్టు కూడా ఎంపికైందని తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన జంపపాలెం విద్యార్థులకు, అల్లూరిజిల్లా చింతపల్లి విద్యార్థులకు డీఈవో బహుమతులు అందజేశారు.

రెండో రోజూ విద్యార్థి సంఘాల ఆందోళన



కళాశాల ఎదుట కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల ఆందోళన

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 15: స్థానిక నరసింగరావుపేటలోని ప్రైవేటు జూనియర్ కళాశాల వద్ద రెండో రోజు గురువారం కూడా విద్యార్థి సంఘాలు, మృతి చెందిన విద్యార్థి కుటుంబసభ్యులు, బంధువులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రమణ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. శివాజీ మాట్లాడుతూ మృతి చెందిన విద్యార్థి వంశీ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై ఇప్పటివరకు విద్యాశాఖాధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. వంశీ మృతిపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో విద్యార్థి తండ్రి చిరంజీవి, ఇతర కుటుంబసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తక్షణమే నివేదిక అందించండి

అనకాపల్లిలోని ప్రైవేటు కళాశాలలో చదువుతున్న విద్యార్థి మృతి పై తక్షణమే నివేదిక అందించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సీతారాం అధికారులను ఆదేశించినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి వంశీ మృతి వార్త సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో కమిషన్ సీరియస్‌గా తీసుకుందని సీతారాం తెలిపారు. ఈ వ్యవహారాన్ని అన్ని కోణాల్లో విచారణ జరిపి త్వరితగతిన నివేదిక అందించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు, పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న మంత్రులు

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, ఫిబ్రవరి 15: కార్పొరేట్ సంస్థలకు జిల్లా మంత్రులు కొమ్ము కాస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు జిల్లా ప్రయోజనాల కంటే కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారన్నారు. మాడుగుల నియోజకవర్గంలో గల పెదకోటరేగుపాలెం వద్ద అదానీ హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణానికి రైవాడ రిజర్వాయర్ నీరు ఇవ్వడానికి సిద్ధమవుతుండడం దారుణమన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదముందన్నారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ ఇటు రైతాంగాన్ని, జిల్లా ప్రజలను తీవ్రంగా మోసం చేస్తున్నారన్నారు. వ్యవసాయానికి పూర్తిస్థాయిలో నీరందించలేని నాయకులు కార్పొరేట్ సంస్థలకు రిజర్వాయర్ల నీటిని సరఫరా చేసేందుకు సిద్ధమవ్వడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. గంగవరం పోర్టును 32 వేల కోట్ల ప్రభుత్వ ఆస్తిని 646 కోట్లుకు అమ్మేశారని ఆరోపించారు. దీనిపై జిల్లా మంత్రులు నోరెత్తకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గోకివాడ లోవకృష్ణ, మళ్ల గణేష్, మళ్ల శేషు తదితరులు పాల్గొన్నారు.

చుక్కపల్లిలో ఎడ్ల బండ్ల పరుగు పోటీలు



మైదానంలో పరుగు తీస్తున్న ఎడ్లు

చీడికాడ, ఫిబ్రవరి 15: మండలంలోని చుక్కపల్లి గ్రామంలో గురువారం జిల్లాస్థాయి ఎడ్ల బండ్ల పరుగు పోటీలు నిర్వహించారు. గ్రామంలో అభయాంజనేయస్వామి తీర్థం పురస్కరించుకొని నిర్వహించిన ఈ పోటీల్లో 15 జతల ఎడ్లు పాల్గొన్నాయి. విజయనగరం జిల్లా వల్లంపూడి ఎద్దులకు ప్రథమ స్థానం రాగా, అర్జునగిరి ఎద్దులకు 2వ స్థానం, చుక్కపల్లికి మూడవ స్థానం, లెక్కలవానిపాలెం 4వ స్థానం, చుక్కపల్లి ఎద్దులకు 5వ స్థానం వచ్చాయి. విజేతలకు నిర్వాహకులు రూ.12వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు చొప్పున నగదు బహుమతులు అందించారు.

ఇందిరా మార్కెట్లో చెత్త సమస్య పరిష్కారం



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మార్కెట్‌లో చెత్తను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 15 : పట్టణంలోని ఇందిరా మార్కెట్‌లో ఎట్టకేలకు చెత్త సమస్యకు పరిష్కారం లభించింది. 'చెత్తమయంగా ఇందిరా మార్కెట్' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు వెనువెంటనే స్పందించారు. ఈ మేరకు మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబు మార్కెట్‌లోని చెత్తను శుభ్రం చేయించేందుకు చర్యలు చేపట్టారు. గురువారం 25 మంది పారిశుధ్య కార్మికులతో మార్కెట్లో గుట్టలా పేరుకుపోయిన చెత్తను ఎత్తించి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. మార్కెట్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని చుట్టుపక్కల ప్రజలు సూచిస్తున్నారు. అలాగే ప్రతి రోజూ శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలని పాలకవర్గం, అధికారులను కోరుతున్నారు.

బాల్య వివాహాల నిరోధానికి పటిష్ఠ చర్యలు చేపట్టాలి

» ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ పీడీ అనంతలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న అనంతలక్ష్మి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 15: బాల్య వివాహాల నిరోధానికి పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ పీడీ కె.అనంతలక్ష్మి అన్నారు. స్థానిక జీవీఎంసీ బాలికోన్నత పాఠశాలలో గురువారం భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కేజీబీవీ ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కుల ఉల్లంఘన లేకుండా చేయాలన్నారు. వైద్యాధికారిణి పావని మాట్లాడుతూ ఎవరైనా లింగనిర్ధారణ పరీక్షలు చేసినా, ప్రోత్సహించినా వారిపై చర్యలు తీసుకుంటారన్నారు. హాస్టళ్లలో ఉన్న పిల్లలకు రక్తహీనత లేకుండా లోపాలను గుర్తించి సరైన విధానంలో పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతున్నట్టు సమాచారమిచ్చినట్టయితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ జిల్లా అధికారి శరత్‌బాబు, ప్రొటెక్షన్ అధికారిణి పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి

» ఆర్టీవో ప్రకాశరావు



అవార్డులు అందుకున్న డ్రైవర్లతో అధికారులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 15: జాగ్రత్తలను పాటించి ప్రమాదాల రహిత సంస్థగా పీటీడీని తీర్చిదిద్దాలని జిల్లా రవాణా శాఖ అధికారి కేవీ ప్రకాశరావు సూచించారు. గురువారం పీటీడీ డిపోలో జరిగిన రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మోటార్ వాహన చట్టం నిబంధనలను పాటించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఏకాగ్రతతో పనిచేయాలన్నారు. బ్లాక్ స్పాట్‌ల వద్ద జాగ్రత్తలు పాటించాలన్నారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా ఉత్తమ డ్రైవర్లకు పీటీడీ డీపీటీవో కె.పద్మావతి ఆధ్వర్యంలో ఆర్టీవో సత్కరించి, నగదు బహుమతులను అందజేశారు. రీజియన్ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఈఎస్ నారాయణ, ఏఎస్ రావు, సీహెచ్‌ఏ రావు బహుమతులు పొందగా.. అనకాపల్లి డిపో పరిధిలో పీఏ రావు, ఎస్ఆర్ రావు, కేఎస్ వాసు, నర్సీపట్నం డిపో పరిధిలో కేఆర్ బాబు, ఐడీజే రావు, పీపీ రావు బహుమతులు పొందారు. వీరికి ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ పి.పైడపునాయుడు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, పీటీడీ ఏడీఎం రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఎన్నికల ఏర్పాట్లు

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 15: రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులందరూ ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులకు అప్పగించిన బాధ్యతలను ఎన్నికల కమిషన్ నిబంధనలమేరకు పనిచేయాలన్నారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలను తూ.చ. తప్పకుండా ఆచరించాలన్నారు. జిల్లాలోని అధికారులను వారి పనిచేసే శాఖ నిబద్ధతను అనుసరించి టీములుగా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వీరందరికీ 16వ తేదీన శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు, కమాండ్ కంట్రోల్‌రూమ్ సెంటర్, వీడియోవీవింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్, అకౌంటింటింగ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, వీడియో సర్వేలన్స్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్స్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఎన్నికలకు అవసరమైన బందోబస్తును ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న వారంతా నిబంధనల మేరకు నడుచుకోవాల్సి ఉంటుందన్నారు. ఎటువంటి అనుమానాలకు ఆస్కారం లేకుండా విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ విజయభాస్కర్, ముఖ్య ప్రణాళికాధికారి రామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై సస్పెన్షన్ ఎత్తివేత

పాయకరావుపేట, ఫిబ్రవరి 15: పాయకరావుపేటకు చెందిన ఇద్దరు నేతలపై ఉన్న సస్పెన్షన్‌ను తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం గురువారం ఎత్తివేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీచేశారు. పాయకరావుపేటకు చెందిన టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు,మాజీ వైస్ ఎంపీపీ గొర్రెల రాజబాబు, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావులను గతేడాది ఏప్రిల్‌లో పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. తాము ఏ తప్పూ చేయకపోయినా తమను అన్యాయంగా సస్పెండ్ చేశారంటూ ఆవేదన వ్యక్తం చేయడంతోపాటు విషయాన్ని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా వీరిద్దరూ పార్టీ వీరాభిమానులుగా పార్టీ కార్యక్రమాలను చేపడుతున్నారు. ఈక్రమంలో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు సస్పెండైన నాయకులు, మాజీ ఎమ్మెల్యే వి.అనితతో ఇటీవల చర్చలు జరిపి సయోధ్య కుదర్చడంతో సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ గురువారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీచేశారు.

కొత్తగా హైడ్రోపోనిక్ సేద్యం

» అగ్రి ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ విద్యార్థుల బంతి సాగు



బంతిసాగు ప్రాజెక్టును చూపుతున్న విద్యార్థులు

అనకాపల్లి అగ్రికల్చర్, ఫిబ్రవరి 15 : మట్టి అవసరం లేకుండా నీటిలో మొక్కలను పెంచే హైడ్రోపోనిక్ పద్ధతి అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. నీరు, షేడ్‌నెట్, కంటైనర్లు ద్రవరూప ఎరువులు వంటివి వాడి పంటలు పండించే ఈ పద్ధతిని తమ ప్రాజెక్టు అంశంగా ఎన్నుకొని వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు బంతి మొక్కలను విజయవంతంగా పెంచుతున్నారు. పట్టణాలు, నగరాల్లో పెరడులేని ఇళ్లు, అపార్టుమెంట్‌లలో మట్టికి బదులుగా నీడలోనే కూరగాయలు, పూలమొక్కలు పెంపకానికి ఈ పద్ధతిని అనుసరించవచ్చని వారు చెబుతున్నారు. అడ్డంగా, నిలువుగా గొట్టాలను ఉంచి వాటిల్లో నీరు నింపి మొక్కలను పెంచుతున్నామని ఈ హారిజంటల్, వెర్టికల్ పద్ధతుల్లో ఏది ఎలాంటి ఫలితాలనిస్తుందనే విషయాలను తెలుసుకుంటామని విద్యార్థులు చెప్పారు. మరికొందరు విద్యార్థులు కూరగాయల అవశేషాలు తమ హాస్టల్ వంటింటి వ్యర్థాలను ఉపయోగించి గ్యాస్‌ను ఉత్పత్తి చేసే ప్రాజెక్టును చేపట్టారు. గురువారం కె.గణేశ్వరి, కీర్తి, ఎం.హర్షిత, పి. మోరిసెన్, రమ్యశ్రీ, ఎం. శ్రీరామ్ ప్రాజెక్టులను ఏడీఆర్ డాక్టర్ వీవీకే జగన్నాథరావు, పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీఎస్ గోపాలస్వామి పరిశీలించారు.

నేడు మునిసిపల్ సమావేశం

ఎలమంచిలి, ఫిబ్రవరి 15 : ఎలమంచిలి మునిసిపల్ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని మునిసిపల్ అధికారులు తెలిపారు. ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు. పలు అభివృద్ధి కార్యక్రమాలపై తీర్మానాలు చేస్తామన్నారు.

గొల్లల కొండపై రథసప్తమికి ప్రత్యేక ఏర్పాట్లు

ఎలమంచిలి, ఫిబ్రవరి 15 : పట్టణంలోని గొల్లల కొండపై ఉన్న సూర్యభగవానుని ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం క్యూలైన్లు, తాగునీరు, ప్రసాదాన్ని అందజేయనున్నారు.

మెగా శిబిరంలో 116 యూనిట్లు రక్తం సేకరణ

సబ్బవరం, ఫిబ్రవరి 15 : స్థానిక దుర్గమాంబ ఆలయం ఆవరణలో గురువారం జనరేషన్ యువ, తానుబిల్లి ఫౌండేషన్ సౌజన్యంతో జోడుగుళ్ల బంగారుతల్లి సేవా సమితి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరంలో 114 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శింగంపల్లి వెంకటరావు మాట్లాడుతూ.. నిరుపేదలకు అత్యవసరమైన సమయంలో తమను సంప్రదిస్తే ఉచితంగా రక్తం అందించి ఆదుకుంటామన్నారు. అనంతరం రక్తదాతలకు షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు శింగంపల్లి వెంకటరావు, రోటరీ బ్లడ్ బ్యాంక్, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కుంచాలమ్మ, బంగారమ్మ తీర్థం

సబ్బవరం, ఫిబ్రవరి 15: మండలంలోని గొర్లివానిపాలెంలో కుంచాలమ్మ, బంగారమ్మ అమ్మవార్ల తీర్థం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆరు గంటల నుంచి భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ తీర్థంలో సర్పంచ్ దెడ్డం ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు గొర్లి చైతన్య, ఉత్సవ కమిటీ సభ్యులు గండి దేముడు, కేవీ రమణ, త్రిమూర్తులు, గొర్లి కృష్ణ పాల్గొన్నారు.

కూండ్రంలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కొత్తూరు, ఫిబ్రవరి 15 : మండలంలోని కూండ్రంలో రూ.10లక్షలతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణానికి గురువారం సర్పంచ్ నందారపు లక్ష్మి శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామంలో మూడు రోడ్లు నిర్మిస్తున్నట్టు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు జెట్టి సత్యవతి, టీడీపీ నాయకుడు నందారపు సూరిబాబు, జెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విరాళాలను ప్రజాపోరాటాలకు వినియోగిస్తాం

» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 15: తమకు ఇచ్చిన విరాళాలను ప్రజాపోరాటాలకు ఉపయోగిస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నరసింగరావు అన్నారు. మండలంలోని చిప్పాడకు చెందిన రాజాన రామునాయుడు, రమణమ్మ దంపతుల కుమార్తె మాధురి వివాహం సందర్భంగా రూ.50 వేలు సీఐటీయూకి విరాళంగా ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ప్రజల పక్షాన నిరంతరాయంగా పోరాటాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లోకనాథం, ఆర్.రాము, ఆర్వీఎస్ కుమార్, బి.జగన్, ఎన్.రాజేంద్రప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి తీర్థం

రాంబిల్లి, ఫిబ్రవరి 15 : మండలంలోని గొరపూడి పంచాయతీ శివారు అప్పన్నపాలెంలో గురువారం అభయాంజనేయస్వామి తీర్థం ఘనంగా జరిగింది. స్వామివారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గుడి ఆవరణలో భజనలు నిర్వహించారు.

ఆసరా చెక్కుల పంపిణీకి ముందే వెనుతిరిగిన డ్వాక్రా మహిళలు

» ముఖ్యఅతిథి రాక ముందే వెళ్లిపోయిన మహిళలు

» ఎమ్మెల్యే జోగులు మాట్లాడుతుండగా ఖాళీ అయిన కుర్చీలు

» గేట్లు వేసిన వెలుగు సిబ్బంది



ఎస్ రాయవరంలో జరిగిన ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమానికి హాజరై వెళ్లిపోతున్న మహిళలు



కోటవురట్లలో మహిళలు వెళ్లిపోకుండా గేటు మూసివేసిన దృశ్యం

ఎస్.రాయవరం/ కోటవురట్ల, ఫిబ్రవరి 15: పాయకరావుపేట నియోజకవర్గంలో గురువారం ఎస్.రాయవరం, కోటవురట్లలో ఆసరా చెక్కుల పంపిణీ చేయక ముందే డ్వాక్రా మహిళలు వెనుదిరిగారు. ముఖ్యఅతిథి మాట్లాడుతుండగానే మహిళలు వెళ్లిపోతుండడంతో వెలుగు సిబ్బంది గేట్లు వేసేశారు. వివరాల్లోకి వెళితే

ఎస్.రాయవరంలో ఆసరా చెక్కుల పంపిణీకి గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. వైసీపీ ఇన్‌చార్జి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతుండగా సభ మధ్యలోనే మహిళలు వెళ్లిపోవడంతో కుర్చీలు ఖాళీ అయ్యాయి. మిగిలిన మహిళలు వెళ్లిపోతుండడాన్ని గమనించిన వెలుగు సిబ్బంది గేటులను మూసివేశారు. అంతకు ముందు డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కును కంబాల జోగులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలను ముఖ్యమంత్రి ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, వైస్ ఎంపీపీలు బొలిశెట్టి గోవిందరావు, అప్పన్న, సర్పంచ్ అప్పారావు పాల్గొన్నారు.

కోటవురట్లలో అదే పరిస్థితి

కోటవురట్లలో గురువారం ఆసరా చెక్కుల సభ ఆలస్యంగా ప్రారంభం కావడంతో మహిళలు వెళ్లిపోతుండడంతో వెలుగు సిబ్బంది గేట్లు వేశారు. డ్వాక్రా సంఘాలకు ఆసరా చెక్కులను రాజాం ఎమ్మెల్యే, పాయకరావుపేట ఇన్‌చార్జి కంబాల జోగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సాగి సీతబాబు, ఎంపీపీ అప్పలనాయుడు, జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, సర్పంచ్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

శంఖారావం సభను విజయవంతం చేయాలి

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్



సభ స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

తుమ్మపాల, ఫిబ్రవరి 15 : నాగులాపల్లిలో ఈనెల 19న జరగనున్న టీడీపీ శంఖారావం సభను విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. శంఖారావం సభలో టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ పాల్గొననున్నారని, టీడీపీ కుటుంబసభ్యులతో ప్రత్యేకంగా కలుసుకుని పలు సూచనలు చేయనున్నట్టు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులంతా ప్రధానభూమిక పోషించాలన్నారు. టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీ కార్యకర్తలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తగిన ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం కావాలని సూచించారు. అనంతరం నాయకులంతా కలిసి శంఖారావం జరిగే సభ ప్రాంగణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, బీఎస్ఎంకే జోగినాయుడు, బొద్దపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగకరం : కలెక్టర్



సత్కరించిన వలంటీర్లతో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 15 : జిల్లాలో వలంటీర్లు అందిస్తున్న సేవలు లబ్ధిదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి కొనియాడారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వలంటీర్ల పురస్కార ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన 9,223 వలంటీర్లను సేవా వజ్రా, సేవారత్నా, సేవా మిత్ర అవార్డులతో సత్కరించారు. ఈ సమావేశంలో గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారి మంజులావాణి, వలంటీర్లు పాల్గొన్నారు.

కారిడార్ నిర్వాసిత రైతుల నిరసన

నక్కపల్లి, ఫిబ్రవరి 15 : తమ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తామని చెప్పిన అధికారులు దొడ్డిదారిన జిల్లా కేంద్రంలో పరిశ్రమల నిర్మాణాలకు శంకుస్థాపన చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని కారిడార్ నిర్వాసిత రైతులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాజయ్యపేటలో నిర్వాసితులు, రైతు సంఘ ప్రతినిధులు సమావేశమయ్యారు. వీరికి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అప్పలరాజు సంఘీబావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, కూలీలు, దళితులు, మత్స్యకారులకు చట్ట ప్రకారం ఇవ్వవల్సిన పరిహారం, ప్యాకేజీ ఇవ్వకుండా ప్రజలను బెదిరించేలా జిల్లా కేంద్రంలో శంకుస్థాపన చేయడం అప్రజాస్వామికమన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరాజుపేట, అలలాపురం సర్పంచులు కాళ్ల శ్రీను, పెదపూడి శంకరరావు, పి. గంగరాజు,సత్తియ్య, ఆర్.గోవింద్, తాతీలు, బాబ్జీ, గబ్బర్ సింగ్, మహేశ్, కోదండ పాల్గొన్నారు.

రిలే దీక్షకు విశాఖ న్యాయవాదుల సంఘీభావం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 15 : భూ హక్కుల యాజమాన్య చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ స్థానిక కోర్టు వద్ద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దీక్షలు గురువారం కొనసాగాయి. గురువారం విశాఖ నుంచి వచ్చిన మహిళా న్యాయవాదులు జహరా, భార్గవి, సుశీల, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కార్యదర్శులు కేఎస్ సురేష్‌కుమార్ సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టాల అమలు అన్యాయమన్నారు.

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాయి, న్యాయవాదులు పాల్గొన్నారు.

వాడీవేడిగా అచ్యుతాపురం మండల సమావేశం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 15: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. మండల ఏవో కృష్ణ నివేదిక చదివారు. ఇందులో 11 శాఖలకు చెందిన అధికారులు రాలేదు. దీంతో దుప్పితూరు సర్పంచ్ దేశంశెట్టి శంకరరావు, మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు తీవ్ర అభ్యంతరం తెలిపారు. సమావేశానికి రానివారిపై చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. జగనన్న కాలనీలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరులో రెవెన్యూ అధికారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని మడుతూరు సర్పంచ్ మోటూరు సంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. అధికారికంగా జరిగే కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించడంలేదని దిబ్బపాలెం ఎంపీటీసీ సభ్యుడు ఎన్. నరసింగరావు, వెదురువాడ సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావు అధికారులను నిలదీశారు. పూడిమడక జగనన్న కాలనీలో భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయని, విచారణ జరపాలని ఎంపీటీసీ సభ్యురాలు వాసుపల్లి పద్మ సభ దృష్టికి తెచ్చారు. ఒకొక్కరికి మూడు, నాలుగు ప్లాట్లు ఇచ్చారని, అనర్హుల వద్ద నాయకులు డబ్బులు తీసుకొని ప్లాట్లు కేటాయించారని ఆరోపించారు. సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవలసిందిగా జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపుతామని ఎంపీపీ కోన సంధ్య ఎంపీడీఓ సురేష్ కుమార్ హామీ ఇచ్చారు.

ప్రోటోకాల్ తప్పనిసరి అని, పొరపాటున జరిగి ఉండవచ్చని, ఇకపై ఇటువంటివి పునరావృతం కావని ఎంపీడీఓ సురేష్ కుమార్ వివరణ ఇచ్చారు. మడుతూరులో స్థలం కోర్టు పరిధిలో ఉన్నందున ఇంటి స్థలాలు కేటాయించలేకపోయామని డీటీ కుమారస్వామి తెలిపారు. పూడిమడక జగనన్న కాలనీపై విచారణ జరిపిస్తామన్నారు. సమావేశంలో సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సెక్టార్లుగా జిల్లా విభజన : ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లిరూరల్, ఫిబ్రవరి 15 : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాను 158 సెక్టార్లుగా విభజించి, ప్రతీ సెక్టార్‌కు పర్యవేక్షకులుగా పోలీస్ అధికారులను నియమించినట్టు జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకోవలసిన చర్యలను సెక్టార్ అధికారులు, సిబ్బందికి వివరించారు. అనంతరం సెక్టార్ అధికారులు ఎంతవరకు అవగాహన పరుచుకున్నారన్న విషయమై పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు జిల్లాలోని హెడ్‌కానిస్టేబుళ్లు, ఏఎస్‌ఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయబాస్కర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

గణపతి గుడికి రూ.2.5 లక్షలు విరాళం

నక్కపల్లి, ఫిబ్రవరి 15: స్థానిక హైవేకు ఆనుకుని వీవర్స్ కాలనీలో నిర్మిస్తున్న గణపతి ఆలయ ధ్వజస్తంభం నిర్మాణం కోసం నక్కపల్లికి చెందిన కన్నారావు, పాపయ్యమ్మ జ్ఞాపకార్థం వారి వారసులైన గిడుతూరి నాగబాబు, బాబ్జీ, శ్రీను, వెంకట్రావ్, వెంకటరమణ, బండారు లక్ష్మి, గొడుగుల బంగ్రరాజు, ఈశ్వరరావు రూ.2.5 లక్షల నగదును ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఆలయ కమిటీచైర్మన్ బద్రి, ప్రతినిధులు మామిడి వరహాలబాబు, మహేశ్, త్రిమూర్తులు, రాజాబాబు, వెంకటరమణ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

17 నుంచి రాష్ట్రస్థాయి మహిళలు, పురుషుల కబడ్డీ పోటీలు

మునగపాక, ఫిబ్రవరి 15: నాగులాపల్లి గ్రామంలో ఈనెల 17 నుంచి రాష్ట్ర స్థాయి మహిళల, పురుషుల కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎంపీ పెతకంశెట్టి అప్పలనరసింహం 88వ జయంతిని పురస్కరించుకుని నారా లోకేశ్ యువగళం విజయోత్సవ కప్ పేరిట క్రీడలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రీడలను మాజీమంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శరగడం యోగి నాగేశ్వరరావు, పొలమరశెట్టి మురళీ పాల్గొన్నారు.

'వసతి' లేదు.. సమస్య తీరదు!

... 5వ పేజీ తరువాయి

వస్తున్నది. ఆటో చార్జీల కోసం నెలకు రూ.500 నుంచి రూ.1,000 వరకు ఖర్చు చేయాల్సి వస్తున్నదని బాలికల తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, నాడు-నేడు కార్యక్రమం కింద పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ పాలకులు.. మరుపాక మోడల్ స్కూల్‌లో బాలికల హాస్టల్‌ను ఎందుకు నిర్మించలేదని వారు ప్రశ్నిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీ సైతం మాటలు తప్ప చేతలు లేవని ఎద్దేవా చేస్తున్నారు.

నిధులు మంజూరైతేనే భవన నిర్మాణం

కె.సత్య సునీల్, ప్రిన్సిపాల్, మరుపాక మోడల్ స్కూల్

మోడల్ స్కూల్‌లో బాలికలకు హాస్టల్ భవన నిర్మాణం కోసం సుమారు ఐదేళ్ల క్రితం అప్పటి ప్రిన్సిపాల్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. పాఠశాల తనిఖీకి వచ్చిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి హాస్టల్ విషయం తీసుకెళుతున్నాం. స్థలం అందుబాటులో వుంది కాబట్టి నిధులు మంజూరైన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

చెరకు రైతులు ఆగ్రహం

... 5వ పేజీ తరువాయి

కాటాల వద్ద లోడింగ్ పనుల కాంట్రాక్టును కొంతమంది ఫ్యాక్టరీ ఉద్యోగులు సబ్‌కాంట్రాక్టుకు తీసుకున్నారని, లోడింగ్ కార్మికులకు ఇంతవరకు చెల్లింపులు జరపకపోవడంతో ఈ సమస్య తలెత్తిందని రైతులు బొబ్బాది రాజు, వెలుగుల కొండబాబు, కసిరెడ్డి రాజు, మాకాల రాజా, నాళం సన్యాసినాయుడు, తలారి రామన్నదొర ఆరోపించారు. ఒప్పందం ప్రకారం కాటా వద్దకు చెరకు తీసుకువచ్చిన 24 గంటల్లో తూకం వేసి ఫ్యాక్టరీకి తరలించాలని, కానీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా మూడు నుంచి ఐదు రోజుల పాటు కాటాల పడిగాపులు కాయాల్సి వస్తున్నదని వాపోయారు. కాగా రైతుల ఆందోళనపై వడ్డాది కాటా ఫీల్డ్‌మెన్ దాసరి శ్రీనివాసరావు, తలారి సత్యనారాయణ, రామారావులను వివరణ కోరగా, కార్మికులకు బకాయిలు చెల్లించడానికి కొంత నగదు తెచ్చామని, కానీ మొత్తం బకాయిలు చెల్లిస్తేనే లోడింగ్ చేస్తామని కార్మికులు స్పష్టం చేశారన్నారు.

అధికారులపై సీఎం అసంతృప్తి

... 5వ పేజీ తరువాయి

దీనిపై కూడా సీఎం తీవ్రస్థాయిలో చీవాట్లు పెట్టినట్టు తెలిసింది. సీఎం ముభావంగా ఉండడంతో ముగింపు వేడుకల్లో భాగంగా రూ.80 లక్షలతో ఏర్పాటుచేసిన డ్రోన్‌షోను అధికారులు రద్దుచేయాల్సి వచ్చింది. కార్యక్రమం ముగిసిన తర్వాత నేరుగా రోడ్డు మార్గంలో ఎయిర్‌పోర్టుకు వెళ్లిన సీఎం జగన్ అక్కడ జిల్లా అధికారులపై తన ఆగ్రహాన్ని వ్యక్తంచేసినట్టు సమాచారం. అంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన కార్యక్రమం ముగింపు వేడుకను ఎంతో ఘనంగా చేస్తామని చెప్పి పూర్తిగా చెడగొట్టారని అసహనం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఎన్నికల ముందు ఇలాంటి పరిస్థితి పార్టీపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే స్పృహ కూడా లేదా?... అని ప్రశ్నించినట్టు సమాచారం. అక్కడితో శాంతించని సీఎం జగన్ బుధవారం జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కూడా ఇదే అంశాన్ని మళ్లీ ప్రస్తావించినట్టు తెలిసింది. 'ఆడుదాం ఆంధ్రా' వైఫల్యంపై సీఎం ఆగ్రహంతో ఉన్నారనే అంశంపైనే జిల్లా అధికారుల మధ్య చర్చ జరుగుతోంది.

మరువక పత్రాల అలంకరణలో శ్యామా అమ్మవారు

సబ్బవరం, ఫిబ్రవరి 15: మండలంలోని దేవీపురంలో గురువారం శ్యామా అమ్మవారు మరువక పత్రాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గురుపత్ని అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ.. సుగంధ పరిమళాలు వెదజల్లే మరువక పత్రాలను బెంగళూరు నుంచి తెప్పించి అమ్మవారిని అలంకరించామన్నారు. కార్యక్రమంలో శ్రీవిద్య ట్రస్టు నిర్వాహకులు కందర్ప ప్రభాకర్, రమా, భక్తులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల్లో అక్రమంగా పేరు మార్పు

» వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడి డిమాండ్

కొత్తూరు, ఫిబ్రవరి 15 : రెవెన్యూ రికార్డుల్లో తమ భూమిని అక్రమంగా పేరు మార్చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు దయాకర్ ఒక ప్రకటనలో అధికారులను డిమాండ్ చేశారు. తన తండ్రి వంగల అప్పారావు పేరిట అనకాపల్లి మండలం అచ్చియ్యపేటలో సర్వే నంబరు 521/2లో 4.63 ఎకరాల డి.పట్టా భూముందన్నారు. వెంకుపాలెం సర్వే నంబరు 344/2లో 2.2 ఎకరాల డి.పట్టా సాగు భూమి ఉందన్నారు. ఆ రెండు భూములను తన చిన్నాన్న కొడుకు శేషగిరి ఆక్రమించి, తానొస్తే చంపుతానని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అచ్చియ్యపేటలో ఉన్న డి.పట్టాను శేషగిరి పేరు రికార్డులో మార్పిడి చేయించుకున్నారని ఆరోపించారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే రెడ్ మార్కులో పెట్టి ప్రస్తుతం ఆ మార్కును తొలగించారన్నారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రెవెన్యూ, పోలీసు అధికారులు తనకు రక్షణ కల్పించాలని దయాకర్ కోరారు.

రైతులకు ఉచిత బోర్లు వేయించిన జనసేన నేత

సబ్బవరం, ఫిబ్రవరి 15: జనసేన పార్టీ పెందుర్తి నియోజకవర్గ నాయకుడు బలిరెడ్డి అప్పారావు (బీఏరావు) తన సొంత నిధులతో గాలిభీమవరంలో ఇద్దరు నిరుపేద రైతులకు గురువారం ఉచితంగా బోర్లు తీయించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆ రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బీఏ రావు మాట్లాడుతూ.. తమ అధినేత పవన్ కల్యాణ్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు.

ప్రారంభమైన పాండురంగడి కల్యాణోత్సవాలు

పాయకరావుపేట, ఫిబ్రవరి 15: స్థానిక రాధారుక్మిణి సహిత పాండురంగస్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రధానార్చకులు కృష్ణస్వామి స్వామి అమ్మవార్లకు విశేష పూజలనంతరం సాయంత్రం 4 గంటలకు పంచరాత్ర ఆగమశాస్త్రానుసారం క్రతువులను నిర్వహించారు. ఆలయ ఈఓ ఎస్.వెంకటాద్రితోపాటు భక్తులు స్వామిని దర్శించి పూజలు నిర్వహించారు. శుక్రవారం జరగనున్న స్వామివారి దివ్యకల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ వెంకటాద్రి కోరారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నారాయణాచార్యులు, సిబ్బంది సత్తిబాబుపాల్గొన్నారు.

పీటీడీ కార్మికుల నిరసన

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 15: స్థానిక పీటీడీ డిపో ఎదుట ఎస్ఎంయూఏ కార్మికులు గురువారం మధ్యాహ్నం ధర్నా చేపట్టారు. ఏపీ ఎస్టీవోఎస్ జేఏసీ పిలుపులో భాగంగా యూనియన్ డిపో అధ్యక్షుడు ఏఎన్ రావు ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో ధర్నా చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్లు, ఈహెచ్ఎస్ మెడికల్ బిల్లులు, డీఏ ఏరియర్స్ తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎండీ రాజు, జీఎస్ రావు, కె. వరహాలు, గిరి, టీవీఏ రావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలను సందర్శించిన జడ్సీ



సిబ్బందితో మాట్లాడుతున్న జడ్సీ అయ్యప్పనాయుడు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 15 : పట్టణంలోని సచివాలయాలను గురువారం జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ ఓ.అయ్యప్పనాయుడు సందర్శించారు. సచివాలయాల్లో ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎలా జరుగుతుందో పరిశీలించారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సచివాలయ సిబ్బందికి సూచించారు.

నూతన మోటార్ వాహన చట్టాన్ని రద్దు చేయాలి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 15: డ్రైవర్లకు ఉరితాడులాంటి నూతన మోటార్ వాహనాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్లతో నిరసన తెలియజేశారు. ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపులో భాగంగా డ్రైవర్లు ఈనెల 16న జరిగే సమ్మెలో పాల్గొనాలన్నారు. తక్షణమే ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.చలపతి, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ

అచ్యుతాపురం, ఫిబ్రవరి 15: అచ్యుతాపురంలో మరిడిమాంబ అమ్మవారు పండగ గురువారం ఘనంగా జరిగింది. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మిరెడ్డి నాయుడుబాబు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

లారీ ఆటో ఢీ: ఒకరికి గాయాలు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 15: సెజ్ రోడ్డులో ఆటో లారీ ఢీకొన్న సంఘటనలో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉండటం వల్ల ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కి కాలు విరిగిపోయింది. ఆటోలో చిక్కుకున్న డ్రైవర్‌ని స్థానికులు బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరిడిమాంబను దర్శించుకున్న టీడీపీ నేతలు

తుమ్మపాల, ఫిబ్రవరి 15 : తుమ్మపాల గ్రామ దేవత మరిడిమాంబ అమ్మవారిని గురువారం మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్ పార్టీ నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, దాడి రత్నాకర్‌లను సత్కరించారు.

విద్యార్థులకు హెల్మెట్లు పంపిణీ

మునగపాక, ఫిబ్రవరి 15: క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం మునగపాక ప్రణతి విద్యానికేతన్‌లో 275 మంది విద్యార్థులకు హెల్మెట్లను ఎస్ఐ బి. ప్రసాదరావు పంపిణీ చేశారు. అనంతరం వ్యాసరచన పోటీలలో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్, స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి నాగేశ్వరరావు, డాక్టరు రవి పాల్గొన్నారు.

రోడ్డుపై సంతతో రాకపోకలకు అంతరాయం

కశింకోట, ఫిబ్రవరి 15 : స్థానిక వారపు సంతను రోడ్డుపై నిర్వహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గురువారం కొనుగోలుదారులు ఎక్కువ మంది రాకతో సంత కిటకిటలాడింది. గతంలో ఈ సంత పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న మార్కెట్ యార్డులో జరిగేది. ఇటీవల ఆ యార్డులో కల్యాణమండపం, అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం చేయడంతో కశింకోట ప్రధాన రహదారిలోనే సాగుతోంది. వారపు సంతకు ప్రత్యేక స్థలం కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

'మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి'

తుమ్మపాల, ఫిబ్రవరి 15: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా ఇన్‌చార్జి ఎ.రాజశేఖర్ పేర్కొన్నారు. గురువారం గాంధీనగరంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన టైలరింగ్ అండ్ ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

డీఎస్పీ వెంకటరామయ్య బాధ్యతల స్వీకరణ



నర్సీపట్నం, ఫిబ్రవరి 15 : నర్సీపట్నం డీఎస్పీగా బి.వెంకటరామయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా ఆళ్లగెడ్డ నుంచి బదిలీపై ఇక్కడికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు పోలీస్ అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు నర్సీపట్నంలో జాబ్ మేళా

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 15 : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంఎల్ఏఎస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే గణేశ్ ఇక్కడ ఆవిష్కరించారు. పదిహేను కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకొని 18 నుంచి 35 ఏళ్ల వరకు గల వారు అర్హులు. పూర్తి వివరాలకు 90147 65287, 94947 91935 నంబర్లలో సంప్రదించాల్సిందిగా స్కిల్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ కోరారు.

'పారిశుధ్య సమస్యపై ప్రత్యేక దృష్టి'



గొలుగొండపేటలో మాట్లాడుతున్న ఎంపీడీవో

నాతవరం, ఫిబ్రవరి 15 : గ్రామాల్లో పారిశుధ్య సమస్య పరిష్కారానికి కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో కె.రాంబాబు సూచించారు. గురువారం ఆయన గొలుగొండపేట సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమయ పాలన పాటించని సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ మిడితల వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సారాతో ఒకరి అరెస్టు

గొలుగొండ, ఫిబ్రవరి 15 : ఐదు లీటర్ల సారాతో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. మండలంలోని అమ్మపేటలో గురువారం సారా విక్రయాలు జరుగుతున్నట్టు అందిన ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన చుక్కాల సత్తిబాబును అదుపులోకి తీసుకుని, ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు చెప్పారు. సారా తయారు చేసినా, విక్రయాలు జరిపినా చట్టపరంగా చర్యలు తప్పవన్నారు.

పారిశుధ్య కార్మికులు ధర్నా

» సమ్మె సందర్భంగా జరిగిన చర్చల్లో హామీలకు జీవో ఇవ్వాలని డిమాండ్

» మద్దతు తెలిపిన సీఐటీయూ



జీవో కోసం నినాదాలు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 15 : సమ్మె సందర్భంగా జరిపిన చర్చల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలకు జీవో ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు గురువారం ఇక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు అడిగర్ల రాజు మాట్లాడుతూ మునిసిపాలిటీ ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం గత ఏడాది డిసెంబరు 26 నుంచి జనవరి 12వ తేదీ వరకు సమ్మె చేశారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చర్చలు జరిపి డిమాండ్ల పరిష్కారానికి హామీ ఇచ్చిందన్నారు. సదరు హామీలకు జీవో విడుదల చేయాలని కోరారు. అనంతరం పలువురు పారిశుధ్య కార్మికులు మాట్లాడుతూ సమస్యలన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నేడు ఏరియా ఆస్పత్రిలో ఓపీ విభాగం ప్రారంభం



ఆస్పత్రిలో నిర్మించిన ఓపీ విభాగం

నర్సీపట్నం, ఫిబ్రవరి 15 : ప్రాంతీయ ఆస్పత్రిలో నాబార్డు నిధులతో నిర్మించిన భవనాన్ని ఎంపీ డాక్టర్ సత్యవతి, ఎమ్మెల్యే గణేశ్ శుక్రవారం ప్రారంభించనున్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణిదేవి తెలిపారు. ప్రత్యేక వైద్య సేవలకు సంబంధించిన ఓపీ విభాగం కొత్త భవనంలోకి మార్చుతామన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో సదరం శిబిరం కోసం రెండు గదులు ఏర్పాటు చేసి, మిగిలిన స్థలాన్ని పార్కింగ్‌కు కేటాయించామని చెప్పారు. పై రెండు అంతస్తుల్లో ప్రత్యేక వైద్య సేవలు, పరిపాలనా విభాగం, రికార్డు స్టోర్‌రూమ్, సూపరింటెండెంట్ గది ఉంటుందన్నారు.

రామాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 15 : సీహెచ్.నాగాపురంలో రామాలయం పునర్నిర్మాణానికి సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు గురువారం శంకుస్థాపన చేశారు. టీటీడీ నిధులు రూ.పది లక్షలు, గ్రామస్థులు చందాల ద్వారా వచ్చిన రూ.పది లక్షలు కలిపి రూ.20 లక్షలతో ఈ పనులు చేపడుతున్నారు. వెంకటరమణారావు, రాజేశ్వరి దంపతులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

లింగాపురం రోడ్డుకు భూమి అప్పగింత

» ఎట్టకేలకు అప్రోచ్ రోడ్డు సమస్య పరిష్కారం » పరిహారంగా రూ.10 లక్షలు అందజేత



భూమికి సంబంధించిన పత్రాన్ని కమిషనర్‌కు అందిస్తున్న తహసీల్దార్

నర్సీపట్నం, ఫిబ్రవరి 15 : మునిసిపాలిటీ పరిధి లింగాపురం రోడ్డు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఇక్కడ వరహా నదిపై నిర్మించిన వంతెనకు అప్రోచ్ రోడ్డు లేక 20వ వార్డు పరిధిలోని లింగాపురం గిరిజనులు నదిలోంచి రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. అప్రోచ్ రోడ్డు అభివృద్ధి చేయడానికి పదిహేను సెంట్ల స్థలాన్ని ప్రభుత్వానికి ఇచ్చేందుకు రైతు శెట్టి రమణబాబు ముందుకు వచ్చారు. దీంతో మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబు గురువారం ఇందుకు సంబంధించిన పరిహారం నగదు రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే గణేశ్ సమక్షంలో ఆర్డీవో జయరాం చేతుల మీదుగా రైతు రమణబాబుకు అందజేశారు. ఆ తర్వాత జిరాయితీ భూమిని ప్రభుత్వ భూమి బదలాయింపు పత్రాన్ని తహసీల్దార్ శ్రీరాములు కమిషనర్‌కు అందించారు. అనంతరం ప్రజలు రాకపోకలకు వీలుగా ఎక్స్‌కవేటర్‌తో భూమిని చదును చేసి ఇరవై అడుగుల వెడల్పు, 378 అడుగులు పొడవున రోడ్డు ఏర్పాటుకు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, గొలుసు నర్సింహమూర్తి, కౌన్సిలర్ బైపురెడ్డి చినబాబు, గణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కిరాని లచ్చన్నపాలెం వలంటీర్ హత్య కేసు

» పదిహేను రోజులుగా సాగుతున్న దర్యాప్తు » పలువుర్ని విచారించిన పోలీసులు



వలంటీర్ హరినాథ్ (ఫైల్ ఫొటో)

మాకవరపాలెం, ఫిబ్రవరి 15 : మండలంలోని లచ్చన్నపాలెం గ్రామ వలంటీర్ హత్య కేసు నేటికీ కొలిక్కి రాలేదు. ఈ ఘటన జరిగి రెండు వారాలుగా గడుస్తున్నప్పటికీ స్పష్టమైన ఆధారాలు లభించకపోవడం గమనార్హం. ఫిబ్రవరి ఒకటో తేదీన వలంటీర్ హరినాథ్ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసును నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హరి, నాతవరం ఎస్ఐ రామారావు, మాకవరపాలెం ఎస్ఐ రామకృష్ణారావులు ఛేదించేందుకు శతవిధాలుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. మృతుని సెల్‌ఫోన్ కాల్ డేటా ఆధారంగా గ్రామం లోని అనేక మందిని స్టేషన్‌కు పిలిచి విచారణ జరిపారు. వలంటీర్‌కు గ్రామంలో వివాహేతర సంబంధాలు ఉన్నాయని ప్రచారం జరగడంతో ఆ కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ సచివాలయ సిబ్బందితో పాటు గ్రామంలోని పలువురు ప్రముఖులను విచారణ చేస్తున్నారు. నిర్దిష్టమైన ఆధారాలు మాత్రం లభించకపోవడంతో హంతకులను గుర్తించలేకపోతున్నారు. దీనిపై స్థానిక ఎస్ఐ రామకృష్ణారావును వివరణ కోరగా, విచారణ కొనసాగుతుందన్నారు. మరికొద్ది రోజుల్లో పూర్తికానున్నట్టు చెప్పారు.

అధికారులపై సీఎం అసంతృప్తి

... 5వ పేజీ తరువాయి

దీనిపై కూడా సీఎం తీవ్రస్థాయిలో చీవాట్లు పెట్టినట్టు తెలిసింది. సీఎం ముభావంగా ఉండడంతో ముగింపు వేడుకల్లో భాగంగా రూ.80 లక్షలు వ్యయంతో ఏర్పాటుచేసిన డ్రోన్‌షోను కూడా అధికారులు రద్దుచేయాల్సి వచ్చింది. కార్యక్రమం ముగిసిన తర్వాత నేరుగా రోడ్డు మార్గంలో ఎయిర్‌పోర్టుకు వెళ్లిన సీఎం జగన్ అక్కడ జిల్లా అధికారులపై తన ఆగ్రహాన్ని వ్యక్తంచేసినట్టు సమాచారం. అంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన కార్యక్రమం ముగింపు వేడుకను ఎంతో ఘనంగా చేస్తామని చెప్పి పూర్తిగా చెడగొట్టారని అసహనం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఎన్నికల ముందు ఇలాంటి పరిస్థితి పార్టీపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే స్పృహ కూడా లేదా?...అని ప్రశ్నించినట్టు సమాచారం. అక్కడితో శాంతించని సీఎం జగన్ బుధవారం జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కూడా ఇదే అంశాన్ని మళ్లీ ప్రస్తావించినట్టు తెలిసింది. 'ఆడుదాం ఆంధ్రా' వైఫల్యంపై సీఎం ఆగ్రహంతో ఉన్నారనే అంశంపైనే జిల్లా అధికారుల మధ్య చర్చ జరుగుతోంది.

చెరకు రైతులు ఆగ్రహం

... 5వ పేజీ తరువాయి

కాటాల వద్ద లోడింగ్ పనుల కాంట్రాక్టును కొంతమంది ఫ్యాక్టరీ ఉద్యోగులు సబ్‌కాంట్రాక్టుకు తీసుకున్నారని, లోడింగ్ కార్మికులకు ఇంతవరకు చెల్లింపులు జరపకపోవడంతో ఈ సమస్య తలెత్తిందని రైతులు బొబ్బాది రాజు, వెలుగుల కొండబాబు, కసిరెడ్డి రాజు, మాకాల రాజు, నాళం సన్యాసినాయుడు, తలారి రామన్నదొర తదితరులు ఆరోపించారు. ఒప్పందం ప్రకారం కాటా వద్దకు చెరకు తీసుకువచ్చిన 24 గంటల్లో తూకం వేసి ఫ్యాక్టరీకి తరలించాలని, కానీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా మూడు నుంచి ఐదు రోజుల పాటు కాటాల పడిగాపులు కాయాల్సి వస్తున్నదని వాపోయారు. కాగా వడ్డాది కాటా ఫీల్డ్‌మెన్ దాసరి శ్రీనివాసరావు, తలారి సత్యనారాయణ, రామారావులను వివరణ కోరగా, కార్మికులకు బాకాయిలు చెల్లించడానికి కొంత నగదు తెచ్చామని, మొత్తం బకాయిలు చెల్లిస్తేనే లోడింగ్ చేస్తామని కార్మికులు అన్నారన్నారు.

'వసతి' లేదు.. సమస్య తీరదు!

... 5వ పేజీ తరువాయి

వస్తున్నది. ఆటో చార్జీల కోసం నెలకు రూ.500 నుంచి రూ.1,000 వరకు ఖర్చు చేయాల్సి వస్తున్నదని బాలికల తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, నాడు-నేడు కార్యక్రమం కింద పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ పాలకులు.. మరుపాక మోడల్ స్కూల్‌లో బాలికల హాస్టల్‌ను ఎందుకు నిర్మించలేదని వారు ప్రశ్నిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీ సైతం మాటలు తప్ప చేతలు లేవని ఎద్దేవా చేస్తున్నారు.

నిధులు మంజూరైతేనే భవన నిర్మాణం

మోడల్ స్కూల్‌లో బాలికలకు హాస్టల్ భవన నిర్మాణం కోసం సుమారు ఐదేళ్ల క్రితం అప్పటి ప్రిన్సిపాల్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. పాఠశాల తనిఖీకి వచ్చిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి కూడా హాస్టల్ విషయం తీసుకెళుతున్నాం. స్థలం అందుబాటులో వుంది కాబట్టి నిధులు మంజూరైన వెంటనే భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

- కె.సత్య సునీల్, ప్రిన్సిపాల్, మరుపాక మోడల్ స్కూల్

మూడు వాహనాలు మారి..!



ఇంగ్లిష్ మీడియంలో బోధనతోపాటు 9వ తరగతి నుంచి హాస్టల్ సదుపాయం వుంటుందని చెప్పడంతో ఆరో తరగతిలో ఇక్కడ చేరాను. ఐదేళ్లు కావస్తున్నప్పటికీ హాస్టల్ భవనం నిర్మించలేదు. రోజు ఉదయం మా నాన్న బైక్‌పై కొత్తకోట వరకు తీసుకువచ్చి వదిలిపెడతారు. అక్కడి నుంచి రావికమతం వరకు బస్సులో వెళ్లి, మళ్లీ అక్కడ నుంచి ఆటోలో స్కూల్‌కు వెళుతున్నారు. సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్లడం కూడా ఇంతే. ఆటోకు రోజుకు రూ.40 చార్జీ అవుతున్నది.

గాలి చైతన్యలక్ష్మి, టెన్త్, జెడ్.కొత్తపట్నం,రావికమతం మండలం

చోడవరం
నియోజకవర్గం



ఆందోళన చేస్తున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

కార్మిక సంఘాల ఆందోళన

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 15 : ఢిల్లీలో రైతుల ఉద్యమాన్ని కేంద్రం ఉక్కుపాదంతో అణిచివేయడాన్ని నిరసిస్తూ వడ్డాది కూడలిలో రైతులు, కార్మిక సంఘాల నాయకులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే సోమనాథ్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, నాలుగు నల్ల చట్టాలను, లేబర్ కోడ్ రద్దు చేయాలని, కార్మికుల కనీస వేతనం చట్ట ప్రకారం నెల రూ. 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రావాడ వరహాలు, వర్రి సూరిబాబు, దాసరి కొండబాబు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

రావికమతం, ఫిబ్రవరి 15 : మండలంలోని చిలకవానిపాలెం గ్రామ దేవత దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు గుంటూరు లక్ష్మణ శర్మ ఆధ్వర్యంలో భక్తులు ముందుగా అమ్మవారికి పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ మడగల ఫాల్గుణ, ఉప సర్పంచ్ దంపతులు సీతిన రాము, కుమారి, మండల ఉపాధ్యక్షుడు మత్సా భవానీ ప్రసాద్, అప్పలనాయుడు, వెంకునాయుడు పాల్గొన్నారు.

'చలో విజయవాడను జయప్రదం చేయండి'

దేవరాపల్లి, ఫిబ్రవరి 15 : సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ ఆర్థిక కార్యదర్శి గేదెల సింహాద్రప్పడు కోరారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

19 నుంచి కేశవస్వామి కల్యాణోత్సవాలు

చోడవరం, ఫిబ్రవరి 15 : పట్టణంలో ఈనెల 19 నుంచి 25 వరకూ కేశవస్వామి కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకుడు సుదర్శన సీతారామాచార్యులు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బీఎన్ రోడ్డు పనుల్లో మళ్లీ కదలిక

» వచ్చే ఎన్నికల్లోగా పూర్తయ్యేనా..?

» స్థానికుల్లో అనుమానం



అధ్వానంగా ఉన్న పట్టణంలోని ప్రధాన రహదారి



పట్టణంలో ప్రారంభించిన రహదారి పనులు

చోడవరం, ఫిబ్రవరి 15 : బీఎన్ రోడ్డు విస్తరణ పనుల్లో మళ్లీ కదలిక మొదలైంది. న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు నిధులు (ఎన్‌డీబీ)తో నాలుగేళ్ల క్రితం మొదలవ్వాల్సిన ఈ పనులు, టెండరింగ్ రివర్స్ టెండరింగ్‌తో జాప్యం జరగడం, తరువాత సకాలంలో బిల్లులు మంజూరు కాక కాంట్రాక్టర్ పనులను అసంపూర్తిగా నిలిపివేసిన సంగతి విదితమే. నియోజకవర్గంలో ఎంతో ప్రధానమైన ఈ రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు నాలుగేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో గుంతలు కప్పుతూ గత ఏడాది సెప్టెంబరులో వేసిన సిమెంట్ కాంక్రీటు పనులను కూడా సగంలో విడిచిపెట్టేశారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. పనుల్లో భాగంగా మొదట మండలంలోని గంధవరం నుంచి రోలుగుంట వరకూ రహదారిని అభివృద్ధి చేయాల్సి ఉండగా, తొలుత పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయం నుంచి నరసయ్యపేట జంక్షన్ వరకూ సీసీ రోడ్డు వేసే పనులు చేపట్టారు. అలాగే చోడవరం వడ్డాది రోడ్డులో కూడా అక్కడక్కడ కల్వర్టు పనులు చేపట్టి మధ్యలో ఆపివేశారు. దీంతో అన్ని వర్గాలు అధికార పార్టీ నేతలపై వత్తిడి పెరగడంతో ఇటీవల కాంట్రాక్టరుకు రూ. 5 కోట్ల మేర బిల్లులు చెల్లించారు. ఈ నేపథ్యంలో తొలుత అటవీ శాఖ కార్యాలయం నుంచి నరసయ్యపేట జంక్షన్ వరకూ ఉన్న రహదారి పనులు పూర్తి చేయడానికి చర్యలు ప్రారంభించారు. కాంట్రాక్టర్ గురువారం నుంచి ఈ పనులను ప్రారంభించారు. అయితే వచ్చే ఎన్నికల్లోగా ఈ పనులు పూర్తి కావడం కష్టమేనని పట్టణవాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఇష్టానుసారం వాహనాల పార్కింగ్

» తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో దుస్థితి

» ఫిర్యాదులు వెళ్తున్నా.. పట్టని అధికారులు



తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వాహనాలు



నిర్మాణంలో ఉన్న భవనంలో పార్కింగ్ చేసిన బైక్‌లు

చోడవరం, ఫిబ్రవరి 15 : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణ వాహనాల పార్కింగ్‌కు కేంద్రంగా మారిపోతోంది. పట్టణంలో వివిధ పనుల కోసం వచ్చిన వారంతా కార్యాలయం ఆవరణలో వాహనాలను పార్కింగ్ చేసి, దర్జాగా వెళ్లిపోతున్నారు. దీంతో కార్యాలయంలో ఉన్న సబ్‌ట్రెజరీ, సబ్‌జైలు, పంచాయతీ కార్యాలయాలకు వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ కార్యాలయంతో పాటు సబ్‌ట్రెజరీ, సబ్‌జైలు ఉన్నాయి. ఇదే కార్యాలయానికి ఆనుకునిపంచాయతీ కార్యాలయం ఉంది. ఆయా కార్యాలయాల ఆవరణలోకి బయట వ్యక్తులు వచ్చి తమ కార్లు, బైకులను దర్జాగా పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. దీంతో కార్యాలయాలకు వచ్చే సిబ్బంది, అధికారులు తమ వాహనాలను లోపలకు తీసుకురావడం కష్టసాధ్యంగా మారిపోతోంది. సమీపంలో ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వివిధ పనులపై వచ్చిన వారు కూడా ఈ ప్రదేశంలోనే వాహనాలను ఉంచేసి వెళ్లిపోతుండడంతో ఆవరణమంతా వాహనాలతో నిండిపోతోంది. గతంలో ఒకటి రెండు సార్లు రెవెన్యూ అధికారులు, సిబ్బంది పార్కు చేసిన వాహనాలను బయట పెట్టి, లోపలకు రాకుండా గేటు వద్ద కాపలా ఉండేవారు. తరువాత కాలంలో రెవెన్యూ అధికారులు కూడా తమకెందుకులే అన్నట్టుగా వదిలేయడంతో ఇపుడు తహసీల్దార్ కార్యాలయం ఆవరణమంతా పార్కింగ్ ఏరియాగా మారిపోయింది. కార్లు, ఆటోలు, జీపులు, వ్యాన్లు, ట్రాక్టర్లను ఇష్టానుసారం నిలిపి వేస్తున్నారు.అలాగే సగంలో నిర్మాణం ఆగిపోయిన తహసీల్దార్ కార్యాలయం నూతన భవనంలో కూడాకొందరు బైక్‌లు పార్క్ చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు ఖాయం

- టీడీపీ నాయకులు పీవీజీ కుమార్, రామానాయుడు



పాదయాత్ర చేస్తున్న రామానాయుడు, కుమార్

దేవరాపల్లి,ఫిబ్రవరి 15 : వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడానికి టీడీపీ, జనసేన కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్,మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు పిలుపునిచ్చారు. గురువారం వారు తెనుగుపూడి భీమిలింగేశ్వరస్వామి ఆలయం నుంచి మారేపల్లి వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ వారికి ఓటు వేసి తప్పు చేయవద్దన్నారు. నియోజకవర్గానికి చెందిన వ్యక్తి మంత్రిగా ఉన్నప్పటికీ ఇక్కడ అభివృద్ధి జరగలేదని, ప్రజా సమస్యలను పూర్తిగా గాలికి వదిలేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, పోతల పాత్రునాయుడు, పోత చిన్నంనాయుడు, రామారావు, ఈశ్వరరావు, కిల్లి గోవింద, దొగ్గ రమేషు, అంజి, చల్లా నానాజీ, సాంబమూర్తి, రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

20న వడ్డాదిలో నారా లోకేశ్ 'శంఖారావం'



సమావేశంలో మాట్లాడుతున్న తాతయ్యబాబు

రావికమతం/రోలుగుంట, ఫిబ్రవరి 15 : వడ్డాదిలో ఈనెల 20న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం సభ జరగనున్నట్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు తెలిపారు. గురువారం ఆయన రావికమతంలోని గంజివారి రామాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభ ఉదయం 9 గంటలకు జరుగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, గూనూరు మల్లునాయుడు, రావికమతం, చినపాచిల ఉప సర్పంచులు గంజి మోదునాయుడు, కోమటి శంకరరావు, ఎంపీటీసీ సభ్యులు గంజి సూర్యనారాయణ, వేపాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే ఈనెల 20న చోడవరంలో జరిగే శంఖారావం సభను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు పిలుపునిచ్చారు. గురువారం ఆయన రోలుగుంటలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మండల అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి, నాయకులు బాబులునాయుడు, రామకృష్ణ, లగుడు అప్పలనాయుడు, చంద్ర, నరేష్ పాల్గొన్నారు.

మాడుగుల
నియోజకవర్గం

బీమా సొమ్ము చెల్లింపులో జాప్యం

మాడుగుల, ఫిబ్రవరి 15 : మాడుగులలోని ఒకటో వార్డు ఎం. గదబూరు గ్రామానికి చెందిన ఓంద్రు పెంటమ్మ కుమార్తె దేముడమ్మకి వైఎస్సార్ బీమా సొమ్ము చెల్లింపులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. 2022 జనవరి 26న పెంటమ్మ అనారోగ్యంతో మృతి చెందగా అప్పట్లో వైసీపీ నాయకులు ఆమె కుమార్తె దేముడమ్మకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ. 10 వేలు ఇచ్చారు. మిగతా రూ. 90 వేలు నామిని బ్యాంకు అకౌంట్‌లో జమ అవుతాయని చెప్పారు. అయితే ఇప్పటివరకు ఆమె అకౌంట్లో నగదు జమ కాలేదు. ఇదే విషయమై సచివాలయంలో ఆమె అడిగితే ఖాతాలో సొమ్ము జమ అయినట్టు చూపిస్తుందని చెబుతున్నారు. కానీ బ్యాంక్ స్టేట్‌మెంట్‌తో పాటు బ్యాంకు బ్రాంచి మేనేజర్ నగదు పడలేదని లిఖిత పూర్వకంగా ఇచ్చారు. ఈ విషయమై ఆమె అధికారులకు విన్నవిస్తున్నా..ఎవరూ పట్టించుకోవడం లేదు. కాగా డీఆర్‌డీఏ డీపీఎం వెంకటరమణ వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించగా బీమా కంపెనీలో ఏదో లోపం జరిగి ఉండడం వల్ల ఈ సమస్య తలెత్తిందని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆశ వర్కర్ల మండల కమిటీ ఎన్నిక

చీడికాడ, ఫిబ్రవరి 15 : మండలంలోని కోనాం గ్రామంలో ఆశ కార్యకర్తల మండల నూతన కమిటీ ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగింది. మండల అధ్యక్షురాలిగా తంగేటి మంగ (అర్జునగిరి), ఆవాల కొండమ్మ (కోనాం), గౌరవ అధ్యక్షురాలిగా రొంగలి దేముడునాయుడుతో పాటు మరో ఎనిమిది మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

ఒకవైపు మంచు.. మరోవైపు ఎండ

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 15 : మండలంలో గురువారం భిన్న వాతావరణం నెలకొంది. వేకువజాము నుంచి 4 నుంచి ఉదయం 9 గంటల వరకు మంచు కమ్ముకోగా, మధ్యాహ్నం 12 నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. గత నాలుగు రోజులుగా ఉదయం పూట మంచు, చలి మధ్యాహ్నం వేసవిని తలపించేలా ఎండ, ఉక్కపోత వెరసి భిన్న వాతావరణాన్ని తట్టుకునేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఫిబ్రవరి రెండో వారం వచ్చినా వేకువజామున మంచు, చలి తగ్గడం లేదు. సాధారణంగా డిసెంబరు, జనవరి నెలల్లో చలి, మంచు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. కానీ ఇప్పటికీ మంచు, చలి ఎక్కువగా ఉంటున్నాయి. రథసప్తమి, శివరాత్రి తర్వాత సాధారణంగా ఎండలు ఉంటాయి. కానీ ప్రస్తుతం మధ్యాహ్నం పన్నెండు, ఒంటి గంట ప్రాంతంలో వేసవిని తలపించేలా సూర్యుడు చుర్రుమనిపిస్తున్నాడు.

జేఈఈ మెయిన్స్‌లో గురుకుల విద్యార్థి ప్రతిభ

దేవరాపల్లి, ఫిబ్రవరి 15 : మండలంలోని తెనుగుపూడి అంబేడ్కర్ గురుకుల కళాశాలకు చెందిన సబ్బవరపు కార్తీక్ జేఈఈ మెయిన్స్‌లో (పెర్సెన్ టైల్‌లో) ఆల్ ఇండియా లెవెల్‌లో ప్రతిభ చూపాడు. పరీక్షల్లో 89.94 శాతం ఉత్తీర్ణత సాధించాడు. తెనుగుపూడి గురుకులంలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కార్తీక్ గణితంలో (97.5156), ఫిజిక్స్‌లో (73.93305), కెమిస్ట్రీలో (81.6489) శాతం సాధించినట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్రనాథ్ చెప్పారు.